# ఫ్లాష్ బ్యాక్



**పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం**

## వర్ధమాన దర్శకుడు
## బి. భాస్కర్ పరిచయం
## చలనచిత్ర 1 మార్చ్ 1974

**"ఎన్నో ఊహలతో ఏదో చేద్దామని** చిత్ర పరిశ్రమకు వస్తున్నాం. కానీ ప్రోత్సాహమే దొరకడంలేదు. ఈ చిత్ర పరిశ్రమలో వున్న సహాయ నిరాకరణ మరే పరిశ్రమలోనూ లేదేమో" అని అన్నారు "మనుషులు – మట్టిబొమ్మలు" చిత్ర దర్శకుడు బైరిసెట్టి భాస్కర్ చలనచిత్ర ప్రతినిధితో ముచ్చటిస్తూ.

కావలసినంత ఒడ్డూ పొడుగుతో. ఏ పోలీసు అధికారిగానో సరిగ్గా సరిపోతాడనిపించే భాస్కర్ నిజంగానే కొంతకాలం పోలీసు ఆఫీసులో స్టెనో టైపిస్టుగా పనిచేశారు. స్వంత ఊరు సికింద్రాబాద్, చదువు హెచ్.ఎస్.సి మాత్రమే. పుట్టింది 29 ఆగస్టు 1940లో.

మీకు సినిమా పరిశ్రమకు రావాలనే ఊహ ఎందుకు కలిగింది? అన్న ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ "నాకు పుట్టి బుద్దెరిగినప్పటినుండి సినిమా పిచ్చి చాలా జాస్తిగా వుండేదండి.

అది 1953 సంవత్సరం. అప్పటికి ఫోర్తుఫారం చదువుతూ వుండేవాణ్ణనుకుంటాను. స్కూలుకు గుడ్‌బై కొట్టి కలకత్తా బండి ఎక్కాను. భాషరాదు. ఏం చేయాలో తెలియదు.

కలకత్తాలోని న్యూ థియేటరులో 'సౌండ్‌బోయ్'గా చేరాను. ఆ తర్వాత కలకత్తానుండి బొంబాయికి మకాం కట్టాను. అప్పట్లో శక్తిసామంత 'బహూ' చిత్రాన్ని తీస్తున్నారు. ఆయన దగ్గర అసిస్టెంటుగా చేరాను. అది అయిపోయింది.

ఇంటిపైకి గాలి మళ్ళింది. సికింద్రాబాద్ చేరాను. తిరిగి స్కూలు రెండేళ్ళు చదివాను. హెచ్.ఎస్.సిపూర్తి చేశాననిపించుకున్నాను. పోలీసు ఆఫీసులో స్టెనో టైపిస్టుగా ఉద్యోగంలో ప్రవేశించాను. కానీ సినీరంగంపై మోజు అంతకంతకూ పెరుగుతూ వుందేగానీ తగ్గడంలేదు.

1958లో తాపీ చాణక్య దర్శకత్వంలో 'భాగ్యదేవత' చిత్రం ప్రారంభమైంది. ఆయనవద్ద అసిస్టెంటు డైరెక్టరుగా చేరాను. దానితో నా సినీ జీవితం ప్రారంభమైంది. చాణక్యగారి వద్ద 'కుంకుమరేఖ', 'కలిసివుంటే కలదు సుఖం', 'జల్సారాయుడు' చిత్రాలకు అసిస్టెంటుగా పనిచేశాను. భరణీ రామకృష్ణరావుగారి వద్ద 'ఆత్మబంధువు' చిత్రానికీ, సి.ఎస్.రావుగారివద్ద 'పెళ్ళికాని పిల్లలు', వి.మధుసూధనరావుగారి వద్ద 'పదండి ముందుకు,' 'ఆత్మబలం', 'జమీందారు', 'అంతస్తులు', 'ఆస్తిపరులు' చిత్రాలకు అసిస్టెంటుగా పనిచేశాను.

తమ్మారెడ్డి కృష్ణమూర్తిగారు రవీంద్రా ఆర్టు పిక్చర్స్ బానర్ క్రింద నిర్మించిన 'బంగారుగాజులు' చిత్రానికి సి.ఎస్.రావుగారివద్ద అసిస్టెంట్‌గా పనిచేశాను.

తరువాత చిత్ర పరిశ్రమలో నాకు ఉత్సాహం కనిపించలేదు. ప్రోత్సాహం లభించలేదు. మా వూరి బండెక్కాను. బ్రతుకు తెరువుకు ఏదో చేయాలికదా! మున్సిపల్ కాంట్రాక్టరుని అయ్యాను. మూడేండ్లపాటు కాంట్రాక్టులు చేశాను. సినిమా గురించిన ఆలోచనలు ఒకవైపులాగుతున్నా బలవంతాన అణచిపెట్టుకుంటూ వచ్చాను.

వి.మధుసూధనరావుగారి వద్ద నేనూ, పి.సి.రెడ్డిగారూ కలిసి పని చేశాము. మా యిద్దరికీ మంచి స్నేహం వుంది. పి.సి.రెడ్డిగారు 'బడిపంతులు' చిత్రానికి దర్శకత్వం వహిస్తూ నన్ను పిలిపించారు. ఆ చిత్రానికి ఆయన వద్ద అసోసియేట్‌గా పని చేశాను.

దర్శకులు పి.సి.రెడ్డిగారూ, నిర్మాత పేర్రాజుగారూ నన్ను బాగా ప్రోత్సహించారు. ఈ కాలంలోనే హైదరాబాద్ నుండి నిర్మాత టి. కృష్ణ వచ్చి పి.సి.రెడ్డిగారిని కలిసినపుడు ఆయన నా గురించి సదభిప్రాయం ప్రకటించారు. దానితో నేను 'మనుషులు – మట్టిబొమ్మలు' చిత్రానికి దర్శకుణ్ణయినాను" అని చెప్పారు.

హీరో కృష్ణ నేనూ 'పదండి ముందుకు' చిత్రం నుంచీ మంచి స్నేహితులం. ఆ చిత్రం నుండి నేటి వరకూ మేము ముందుకే నడుస్తున్నాం. హీరో కృష్ణ సహాయ సహకారాలవల్ల నేను ఒక మంచి చిత్రం తీయగలిగాను.

అయామ్ వెరీమచ్ గ్రేట్‌ఫుల్ టు హిమ్. ఈ చిత్రంలో జమున, జగ్గయ్య నాకు అన్ని విధాలుగా సహాయంచేసి తోడ్పడ్డారు.

"మీ చిత్రం చాలా మంచి చిత్రమని అంటున్నారు దాని థీమ్ చెపుతారా?" అని అడిగిన దానికి ఆయన సమాధానం చెబుతూ "మంచిని పెంచే మనిషి జీవితమే మట్టిబొమ్మలు. మనిషి పుట్టవచ్చు – గిట్టవచ్చు. కానీ చాలా మంది

మట్టిబొమ్మలుగానే మిగిలిపోతున్నారు. వీరిలో కొందరు మాత్రమే మనుషులుగా పుట్టి మనుషులుగా మరణిస్తారు. ఆ కొద్దిమందిలో ఒకరి జీవితమే మనుషులూ – మట్టి బొమ్మలు."

మనుషులూ – మట్టిబొమ్మలు చిత్రం పూర్తి అయింది. ఇప్పుడు భాస్కర్ 'నా యిల్లు – నావాళ్ళు' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇదిగాక 'మూడు తరాల కథ', 'చిట్టిమరదలు – పొట్టిబావ' చిత్రాలకు దర్శకత్వ వహించబోతున్నారు.

తెలుగు చిత్రాలు ఒకే మూసలో పోసినట్లు వుండటానికి కారణాలు చెపుతూ "కొత్త పద్ధతిలో చేద్దామంటే ఆర్థిక పుష్టి వుండాలి. పరిశ్రమలో నేడు డిస్ట్రిబ్యూటర్ల డామినేషన్ వుంది. దీనితో 'కొత్త' అనే మాటనే మానుకోవలసి వస్తూవుంది. ఒక టైప్ పిక్చర్ ఏదన్నా విజయవంతమైతే  అదే మూసలో సినిమా వుండాలనీ ఇటు పంపణీదార్లూ, అటు నిర్మాతలూ ఆలోచిస్తున్నారు. అందుకే తెలుగు సినిమాల్లో వెరైటీ లోపిస్తూవుంది" అని అన్నారు.

"తెలుగు ప్రేక్షకులు అతి సున్నితమైన మనసుగలవారు. వారికి సుఖదుఃఖాల్లో ఏ పాలు కాస్త ఎక్కువైనా భరించలేరు. జీవితంలోని చేదు నిజాలనే వారికి చూపి వారిని విసిగించడం నాకు అంతగా యిష్టంలేదు" అని తన అభిప్రాయాన్ని నిష్కర్షగా చెప్పారు.

Post your comments